క్లుప్తంగా

మహిళలు ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

జూలపల్లి: ఉపాధిహామీలో వందరోజులు పూర్తి చేసుకున్న మహిళలు జ్యూట్ బ్యాగుల కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండలాధ్యక్షురాలు రమాదేవిసూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆరురోజులుగా మహిళలకు ఇస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించి కుట్టుశిక్షణ, జ్యూట్ బ్యాగుల తయారీని పరిశీలించి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. ట్రైనర్ నస్రీన్ ఉన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



అన్నదానం చేస్తున్న సమితి సభ్యులు

గోదావరిఖనిటౌన్: స్థానిక పోచమ్మ గుడి ఆవరణలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీ భవానీ దీక్షా యజ్ఞసేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సేవాసమితి గురు భవాని కట్టా సురేశ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం



బట్ట సంచులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాల్వశ్రీరాంపూర్: బట్టసంచులు వినియోగిద్దాం.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం అంటూ మండలంలోని మొట్లపల్లి గ్రామస్తులు నినాదాలు చేశారు. కేసీఆర్ సేవాదళం నాయకులు సోమవారం గ్రామంలో బట్టసంచులు పంపిణీ చేశారు. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని కోరారు.వెంకట్, రవీందర్, కాంతయ్య, శ్యాంసుందర్, వేణుగోపాల్, నాగేంద్రకుమార్, క్రాంతి, రవలి, రాజమ్మ, వీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవోదయలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన



జూలపల్లి: మండలంలోని నాగులపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కుంద అశ్వత్‌సాయి నవోదయ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సీటు సాధించాడు. దీంతో సోమవారం పాఠశాల ఆవరణలో ఎంఈవో కవిత విద్యార్థి అశ్వత్ సాయిని అభినందించి పాఠశాల ధృవీకరణ పత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అశ్వత్‌సాయిని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆశీర్వదించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



అక్షయ



అంజలి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల పదోతరగతిలో ఉత్తీర్ణులైన ఈరవేన అక్షయ, అరికిళ్ల అంజలి బాసర ట్రిపుల్ ఐటీలో ఆరేండ్ల ఇంటిగ్రేటెడ్ బీ.టెక్ కోర్సులో చేరడానికి మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు ఉపాధ్యాయులు అభినందించారు.

రాజకీయంగా ఎదగాలి

ధర్మారం: యాదవ కుర్మలు రాజకీయంగా ఎదగాలని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారం తిరుపతి అన్నారు.మండలకేంద్రంలోని యాదవసంఘం భవనంలో సోమవారం ప్రాథమిక గొర్రెల పెంపకందారుల మండల అధ్యక్షుడు జంగ మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్టీల కతీతంగా గొల్లకుర్మలు ఏకమై రాజకీయంగా ఎదగాలన్నారు. రానున్న ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గాలకు టికెట్లు కేటాయించాలని కోరారు. యాదవులంతా ఒకేతాటిపై నిలబడితే సాధ్యమవుతుందన్నారు. సంఘం నాయకులు వేల్పుల నాగరాజు, లక్ష్మణ్ ఉన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

- అనుమతులు లేక నిలిచిపోయిన పనులు
- గుంతలమయంగా మారుతున్న రహదారి
- ప్రమాదకరంగా మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి



ఇసుక లారీలతో కుంగిపోతున్న రహదారి



రామగిరి మండలం సెంటినరీకాలనీలో గుంతలుగా మారిన మంథని పెద్దపల్లి ప్రధాన రహదారి

కమాన్‌పూర్(రామగిరి): మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై పెద్దపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా కాటారం వరకు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ రామగిరి మండలపరిధిలో రహదారి పనులు పూర్తి కాకపోవడంతో గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిలిచిన రహదారి అభివృద్ధి పనులు

మంథని–పెద్దపల్లి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కాగా 2019 ఆగస్టులో పనులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ నుంచి మంథని రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మంథని వరకు ఉన్న రహదారి అభివృద్ధి పనులు రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పరిధి గొల్లపల్లె నుంచి సెంటనరీకాలనీ, పన్నూర్ క్రాస్‌రోడ్డు వరకు, రత్నాపూర్ గ్రామ పరిధి వాగు బ్రిడ్జి నుంచి నాగేపల్లి వరకు ఉన్న రహదారి అభివృద్ధి పనులు నేటి వరకు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతాల్లోని రహదారి పూర్తి గుంతలు పడి ప్రమాదకంగా మారింది. ఈ ప్రాంతాలు పూర్తిగా సింగరేణి క్షేత్రంగా ఉండడంతో వాహనాల రద్దీ, కార్మికులు, అధికారులు వాహనాలపై ప్రయాణాలు సాగిస్తుంటారు.

ఇసుక లారీలతో కుంగుతున్న రోడ్లు ..

మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై నిత్యం వందలాది ఇసుక లారీలు అధిక లోడుతో వెళ్తుండడంతో అభివృద్ధి పనులు చేపట్టిన రహదారి కిందికి కుంగి ప్రమాదాలకు నిలయంగా మారింది. మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్లే ఇసుక లారీలతో రహదారి కుంగిపోవడంతో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టించుకోని సింగరేణి సంస్థ...

రామగిరి మండలపరిధిలో అభివృద్ధి చేయకుండా వదిలేసిన మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోనే ఉంది. సింగరేణి సంస్థ నుంచి దూరప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్న సింగరేణి ఏరియాలో ఉన్న రహదారి పనులను అభివృద్ధి ఎందుకు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పట్టించుకుంటలేరు



మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి రామగిరి మండల పరిధిలోని రెండు ప్రాంతాల్లో రహదారి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రహదారి పూర్తిగా చెడిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలి. నిధులు లేకపోతే సింగరేణి సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– ముల్మూరి శ్రీనివాస్, సెంటనరీకాలనీ

పనులు పూర్తిచేయించాలి



మంథని–పెద్దపల్లి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేయడానికి సీఎం కేసీఆర్ డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. రామగిరి మండలంలోని కల్వచర్ల నుంచి నాగేపల్లి ఎక్స్‌రోడ్డు వరకు రహదారి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నిలిచిన పెండింగ్ పనులు పూర్తిచేయించేలా చూడాలని కోరుతున్నాం.

– పల్లె ప్రతిమ, సర్పంచ్, రత్నాపూర్

అనుమతులు రాలేదు

మంథని–పెద్దపల్లి రహదారి అభివృద్ధి పనులు రామగిరి మండల పరిధిలో రెండు బిట్ల పనులు చేపట్టడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. అనుమతులు వచ్చాక పనులు చేపడతాం. ఇసుక లారీలో దెబ్బతింటున్న రహదారిని పరిశీలించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– రాములు,
ఆర్అండ్‌బీ, డీఈ, పెద్దపల్లి

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



సాయినాథునికి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పూజలు



రామగుండం: సాయిబాబా ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మంథని/గోదావరిఖనిటౌన్/కమాన్‌పూర్/సుల్తానాబాద్/ఫెర్టిలైజర్‌సిటీ/జూలపల్లి/ఎలిగేడు/రామగుండం/యైటింక్లయిన్‌కాలనీ/ పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేష పూజలతో పాటు సాయినాథుడికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమ అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించి అన్నదానం చేశారు.



ఎలిగేడు: పూజలందుకుంటున్న సాయినాథుడు



సుల్తానాబాద్: పూజలు చేస్తున్న భక్తులు



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కప్పతల్లి ఆటలు



కాల్వశ్రీరాంపూర్: వర్షాకాలంలో ఎండలు దంచి కొడుతున్నాయి. దుక్కులు దున్ని విత్తనాలు వేయాల్సిన సమయంలో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏరువాక సాగక రైతులు వానలు కురవాలని వరుణుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఇదులాపూర్‌లో సోమవారం వర్షాలు కురవాలని రైతులు, గ్రామస్తులు కప్పతల్లి ఆటలాడారు. ఓ రోకలి బండకు పసుపుగుడ్డలో కప్పను కట్టి భుజాలపై మోస్తూ కప్పతల్లికి కడవలతో నీళ్లు పోస్తూ వరుణ దేవున్ని ప్రార్థిస్తూ డప్పుచప్పుళ్లతో ఊరేగింపుచేశారు. ఊరంతా తిరిగి ఇంటింటా సేకరించిన బియ్యంతో పాయసం వండి వరుణ దేవుడికి నైవేద్యం సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించారు.

ఆలయాల్లో జలాభిషేకాలు



జలాభిషేకానికి వెళ్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కమాన్‌పూర్: వర్షాలు పడి పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ మండలంలోని జూలపల్లి గ్రామంలో రైతులు గ్రామంలోని ఆలయాల్లోని దేవతల విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన రైతులు ప్రజాప్రతినిధులు కలిసి కుండలు, బిందెల్లో నీళ్లు తీసుకొని కుండలు, బిందెలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుల్లతో గ్రామంలోని అన్ని ఆలయాలకు వెళ్లి దేవతల విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. సర్పంచ్ బొల్లపల్లి శంకర్ గౌడ్, ఎంపీటీసీ శవ్వ శంకరయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణరెడ్డి, గ్రామస్తులు ఎలబోయిన బాలకుమార్, బూస తిరుపతి, రామూర్తి, తిరుపతి, సుధాకర్, ముత్యాలు, కుమార్, పర్వతాలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో ఆషాడ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం శివుడికి అభిషేకం, అన్నపూజ, శేషవస్త్రాన్ని పలువురు సమర్పించారు. హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సత్యనారాయణ, ఏగోలపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏగోలపు సదయ్యగౌడ్, సుజాత దంపతులు, ఆలయ భక్త బృందం ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాంసానిపల్లె, లంబాడితండా, ఓదెల గ్రామాల్లో ఏఎస్సై లక్ష్మీరాజం ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీచేపట్టారు. ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపు వెళ్లే అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఓదెల ఎంపీడీవో సత్తయ్య సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎస్సారెస్పీ ఉపకాల్వల్లో పూడిక పనులను పరిశీలించారు. జాబ్‌కార్డులు లేని కూలీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణంతో విద్యార్థులకు సౌకర్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ధర్మారం: సీసీరోడ్డు నిర్మాణంతో విద్యార్థుల సమస్య తీరిపోయిందని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజా అన్నారు. ధర్మారం మండలకేంద్రం పరిధిలోని జక్కన్నపల్లి నుంచి గిరిజన బాలికల విద్యాలయం వరకు సోమవారం రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో రోడ్డుపనులను జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు గుట్టపై భాగంలోని విద్యాలయానికి సరైన రోడ్డులేక విద్యార్థులు తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో సమస్య తీరిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు జితేందర్‌రావు, సహకార సంఘాల పోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పరి చంద్రయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, ఉపసర్పంచు ఆవుల లత నాయకులు బాస తిరుపతిరావు, పాకాల రాజయ్య, నాడేం శ్రీనివాస్, కూరపాటి శ్రీనివాస్, ఎండీ.అజాం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డీటీ అబూబాకర్

జూలపల్లి: రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అబూబాకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల సంఘం నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. అతిక్రమించిన పార్టీలపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ధూళికట్ట సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కూసుకుంట్ల రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్లశ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నాడెం మల్లారెడ్డి బీఎస్పీ నాయకులు మామిడిపెల్లి చంద్రశేఖర్, సంపత్, అమరగాని సాయి, సీపెల్లి నరేశ్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్



ఎంపీడీవోకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

జూలపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావుకు సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దుచేయాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సమ్మెనోటీసు అందించినట్లు తెలిపారు. సమస్యలను పట్టించుకోకపోతే ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మెచేస్తామని హెచ్చరించారు. నోటీసులిచ్చిన వారిలో సంఘ మండల అధ్యక్షుడు బాణయ్య, నాగయ్య, లచ్చయ్య, అంజి, హన్మయ్య, ఆంజనేయులు, కనుకయ్య, నర్సయ్య ఉన్నారు.

భర్త చనిపోతే భార్యకు ఆసరా పింఛన్ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ల ఫోరం నాయకులు

కోల్‌సిటీ: భర్తచనిపోతే అతడు పొందుతున్న ఆసరా పింఛన్ మృతుడి భార్యకు ఇవ్వాలని రామగుండం మున్సిపల్ కార్పొరేటర్ల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డీఆర్‌డీఏ పీడీ వి.శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఆసరా పింఛన్ పొందుతున్న భర్త మరణించిన పక్షంలో ఆయన స్థానంలో భార్యకు పింఛన్ మంజూరు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అమలు కావడం లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీశ్ కుమార్, ప్రధానకార్యదర్శి ధాతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మేకల సదానందం, గౌరవ సలహాదారు సాగంటి శంకర్, కార్యదర్శి, నాయకులు తిరుపతి, మీర్జా సలీంబేగ్ పాల్గొన్నారు.

విమానాశ్రయం ఏర్పాటుపై అలసత్వం



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో విమానాశ్రయ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ ఆరోపించారు. సోమవారం బసంత్‌నగర్ విమానాశ్రయం స్థలం వద్ద పార్టీ నాయకులతో కలిసి కాగితపు విమానాలను గాలిలోకి ఎగురవేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటుపై స్థానిక ఎంపీ వెంకటేష్‌నేత పార్లమెంట్‌లో ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి విమానాశ్రయం ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. దేవనూరి సంపత్, జనగామ మల్లయ్య, గడ్డం శేషాద్రి, శ్యాం, మాదాసు నర్సయ్య, దుర్గం సౌజన్య, సునీత, బూడిద పద్మ, భాగ్య, జమున పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం!



నూతన విద్యుత్ స్తంభం వద్ద ప్రజాప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని పెద్దంపేట గ్రామంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యకు సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిష్కరించారు. రాయదండికి వెళ్లే మార్గంలోని వంతెన వద్ద హైటెన్షన్ విద్యుత్ లైన్ చిన్నపాటి ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయేదన్నారు. ఈ సమస్యను ఎంపీటీసీ కొలిపాక శరణ్య, సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ ఎమ్మెల్యే చందర్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యకు పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను తొలగించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నాలుగు డీటీఆర్‌లతో పాటు 10 విద్యుత్ స్తంభాలతో నూతన విద్యుత్ లైన్ వేశారని దీంతో గ్రామంలో అన్నిరకాల విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అంతర్గాం ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మెహందీ వేడుకలు



చేతులకు గోరింటాకు పెట్టుకున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆషాడ మాసం సందర్భంగా యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్‌స్కూల్‌లో మెహందీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. హెచ్‌ఎం రవీందర్‌రావు గోరింటాకు ప్రాముఖ్యతను వివరించారు.

పవర్‌కట్

కమాన్‌పూర్: మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌లోని 220 కేవీ.విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేంద్ర కుమార్‌తెలిపారు. సహకరించాలని కోరారు.